# అంగ వైకల్యం

ఇది జరిగి చాలా ఏళ్ళయింది. అప్పటికి హైద్రాబాద్ నగరం ఇలా లేదు. ఆంధ్ర రాష్ట్రం కొత్తగా ఏర్పడి, హైద్రాబాద్‌ని ముఖ్య పట్టణం చేసుకుని, తెలుగుదనపు వేళ్ళు నగరంలో పాతుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. రజాకార్ల కథలు ఇంకా అక్కడక్కడ వినిపిస్తున్నాయి. ఇంకా కొందరు హైదరాబాద్ సంస్థానానికి అన్యాయం జరిగిపోయిందని, పరాయివాళ్ళు వచ్చి వాళ్ళని పాలించబోతున్నారని గుసగుసలుగా అక్కడ కూడా చెప్పుకుంటున్నారు. ఈ రకమయిన ఆలోచనలున్న వాళ్ళల్లో మత భేదం లేదు. విచిత్రం. వయసు భేదం లేదు- మరీ విచిత్రం. భాషా భేదం లేదు- అంతకన్నా విచిత్రం.

మార్పుని వ్యతిరేకించే వాళ్ళు, కొత్తని ఆహ్వానించేవాళ్ళు. రాక్షసత్వాన్ని. నిరంకుశత్వాన్ని సమర్థించేవాళ్ల-అన్ని జాతుల్లో, అన్ని మతాల్లో అన్ని వయసుల్లో ఉంటారు.

నేను అప్పుడే బి.ఏ. పాసయ్యాను. మా దూరపు చుట్టం, అంతకు మించి మా నాన్నకు మంచి స్నేహితుడు- అప్పారావుగారు అప్పటికే హైద్రాబాద్‌లో టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

అప్పారావుగారికి మా నాన్న రాసిచ్చిన ఉత్తరం పట్టుకుని ఆయన కోసం మా ఊళ్ళో వీరన్న కొట్లో కొన్న లంక పుగాకు పుట్టునీ

చేతిలో చిన్న ట్రంకుపెట్టె పట్టుకుని, ఊపిరి బిగపట్టుకొని ఓ చలికాలం ప్రొద్దున్న హైద్రాబాద్‌లో దిగిపోయాను.

రిక్షావాడు సరసమైన రేటే చెప్పాడు.

సులభంగానే అప్పారావుగారి రూం పట్టుకోగలిగాను.

ఆయన నన్ను చూసి ఆనందపడ్డారు.

మా నాన్న రాసచ్చిన ఉత్తరం చూసి ఆనందపడ్డారు. నేను తెచ్చిన పొకాకు చూసి మరీ ఆనందపడ్డారు.

"ముందుగా రాస్తే స్టేషన్‌కి వచ్చే వాణ్నికదా! రాయొద్దా!" అని కాస్త కోప్పడ్డారు.

"ఏం కంగారుపడకు నీకు త్వరలోనే మంచి ఉద్యోగం వేయిస్తాను. అని ఆయన అన్నప్పుడు నేను మరీ మరీ ఆనందపడ్డాను.

ప్రపంచంలో కాఫీ ఎక్కడ పుట్టిందో తెలియదు కాని, మా వూళ్ళో మాత్రం మా ఇంట్లోనే పుట్టిందని మా నాయనమ్మ చెప్పింది. మా తాతయ్య కాఫీ తాగుతాడని....పూర్వపు రోజుల్లో గొప్పగా. వింతగా అంతకు మించి మా తాతయ్య గురించి నీచంగా చెప్పుకునేవారట.

అలాంటి యింట్లో పుట్టిపెరిగిన నేను, పళ్ళు తోముకోగానే కాఫీ పడక పోతే ఉండలేను.

అప్పారావుగారి అలవాట్లు దీనికి విరుద్ధం,

ఆయన స్నానం చేసి, పూజచేసి, అన్నానికి కుంపటిమీద ఎసరు పెట్టి అప్పుడు టీకి బయల్దేరతారు. వచ్చిన రోజునే తెల్సిపోయింది. హైదరాబాద్‌లో కాఫీ ఎక్కడో కాని దొరకదని....

కాఫీయో, టీయో, ఏవో కాసిన్ని వేన్నీళ్ళు నోట్లో పోసుకుంటే కాని—ప్రాణం నిలకడగా ఉండదు. అప్పారావుగారి పూజాదికాలు పూర్తయ్యేదాకా నేను వేన్నీళ్ల పోసుకోకుండా వుండలేను.... అంచేత....

ఆ పేళ టీ తాగడానికి ఒక్కణ్ణి బయల్దేరాను.

అప్పుడే బిర్లామందిర్ నుంచి రిజర్వ్‌బాంక్‌కి వచ్చేదారిలో ఎత్తయిన గుట్టమీద వుండేది అప్పారావుగారి రూమ్. రూమ్ నుంచి అదే దారిలో అదే రోడ్‌మీదకి వచ్చాను.

అక్కడ హోటలేది కనబడ్లేదు. కాసేపు అటూ ఇటూ పచార్లు చేశాను చివరికి ఓ ఆధారం దొరికింది.

ఇప్పుడు రిజర్వ్‌బాంకు ఉన్న చోట కాస్త వెనకాల ఓ పురాతనమైన బిల్డింగు వుండేది. కింద రోడ్‌మించి చూస్తే ఆ మేడమీద ఏటో హోటల్ ఉన్నట్టుగా కనిపించింది. కిటికీలోంచి మనుషులు అటూ ఇటూ తిరుగుతున్నట్టుగా తెలుస్తోంది. కప్పులు సాసర్లు కనిపిస్తున్నాయి. పైకి వెళ్ళడానికి మెట్లు రోడ్‌వేపు లేవు. వెతగ్గా మెట్లు వెనకవేపు వున్నట్టుగా తెలిసింది.

మెట్లు పట్టుకుని మెల్లిగా మేడ ఎక్కి ఆ హోటల్లోకి వెళ్ళాను.

అంతే!

అవాక్కయిపోయాను.

గుండె కొట్టుకోడం మానేసింది.

నా ముఖంలో నెత్తుర చుక్కలేదు.

ఒళ్ళు జ్వరంతో కాలిపోతున్నట్టు వేడెక్కిపోయింది.

ముందుకు వెళ్ళనూ లేను.

వెనక్కి రానూలేను

కొన్ని జతల కళ్ళు నన్ను చూస్తున్నాయ్.

గుడ్లురిమి చూస్తున్నాయి.

ఆశ్చర్యంగా చూస్తున్నాయి. తీక్షణంగా చూస్తున్నాయి.

అది....

కుష్ఠువాళ్ళ హోటల్....

ఆ హాల్లో టీ తాగేవాళ్లు, బన్ రొట్టి తినేవాళ్ళు, అన్నీ అందించే వాళ్లు, టీ కలిపేవాడు, కప్పులు కడిగేవాడు.... నేను తప్ప.... అందరూ కుష్ఠువాళ్ళే.

కుష్ఠువాళ్ళ కోసం కుష్ఠువాళ్ళు నడుపుతున్న హోటల్.

నాకేం చేయాలో తోచలేదు.

ముందుకెళ్ళి ఆ హోటల్లో కూర్చోడానికి భయం. టీ తాగడానికి భయం. అలాగని వెనక్కి - తిరిగి వద్దామంటే - అంతకన్నా భయం వేస్తోంది.

నాకు నోట మాటరాలేదు.

కాళ్ళు కదల్లడం లేదు.

ప్రాణం లేని ప్రతిమలా నిల్చబడి పోయాను....

వాళ్ళంతా నాకేసి చూస్తున్నారు. అందులో కొందరు నవ్వుతున్నారు కూడా.

ఇద్దరు నా వైపు వచ్చారు.

వాళ్ళు ఉర్దూలో, తెలుగులో "ఏం బాబూ-ఇలా వచ్చావ్ ?" అనడిగారు.

వాళ్ళ మాటలు హేళనగా వున్నాయి.

మరొకతను లేచి గబగబా నా దగ్గరగా వచ్చాడు. మిగిల్లిన ఇద్దరితో "ఏరేయ్.... పోండెహ" అన్నాడు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

"రండి బాబూ-టీ తాగండి" అన్నాడు.

నా కేం చెప్పాలో. ఏం చేయ్యాలో తెలియలేదు. అక్కడ టీ తాగడానికి భయంగా, శంకగా వుంది. తాగనని చెప్తే - ఏమో వాళ్లేం చేస్తారో ?

ధైర్యాన్ని కూడదీసుకుని వెళ్ళి ఓ కుర్చీలో కూర్చున్నాను.

అప్పారావుగారు లేకుండా టీకి బయల్దేరినందుకు, బయల్దేరిన వాణ్ణి రోడ్ మీదున్న ఏదేనా హోటల్ వెతుక్కుని వెళ్ళక, ఆ హోటల్‌కి వెళ్ళినందుకు నన్ను నేను నిందించుకున్నాను.

నన్ను పిల్చినతను నా ముందు టీ పెట్టాడు. నేను సంశయంగా టీ కేసి అతని ముఖం కేసి చూశాను. ఆ టీ తాగడానికి నాకు భయంగా ఉంది. అసహ్యంగా వుంది. అసలా వాతావరణమంతా జుగుప్సాకరంగా వుంది.

కుష్ఠువాళ్ళ హోటల్లో. కుష్టువాడు తయారువేసిన, కుష్ఠువాడు తెచ్చిన టీ....

కుష్ఠు అంటురోగం కాదని నాకు తెల్సు, ఆ టీ తాగినంత మాత్రన నాకు కుష్టు వచ్చెయ్యదని తెలుసు....

అయినా.... ఏదో ?

తాగనంటే....

వాళ్ళు తిడతాడేమో ? కొడతారేమో ?

మీదపడి రక్కేస్తారేమో ? కిందపడేసి కుళ్ళబొడిచేస్తారేమో ? ఆ వేళ్ళ రసంతా నాకు లాసేస్తారేమో ?

ఎన్నో ఆలోచనలూ, ఎన్నో భయాలు

అక్కణ్ణుంచి ఒక్క ఉదుటున పారిపోదామనిపించింది. కాని.... నాలో యింకా ఏదో మిగిలి వుంది. వారిని అవమానించలేను.

గబగబా నాలుగు గుక్కల్లో టీ తాగేశాను. డబ్బులివ్వటంతో అతనన్నాడు—

"మీరియ్యక్కర్లేదు. మమ్మల్ని మీ నోటల్లోకి రానియ్యక పోయినా మా హోటల్‌కి మిమ్మల్ని రానిత్తాం....

మీకెప్పుడు టీ తాగాలనిపించినా ఇక్కడికే రండి....

నేను లేచి బైటికొచ్చేస్తూ, గుమ్మందాకా వచ్చేక ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను.

అందులో కొందరికి చేతివేళ్ళు లేవు. కొందరికి కాలివేళ్ళు లేవు. కొందరికి చెవుల్లేవు. కొందరికి పాదం సగంవరకు ఏమీలేదు. కొంద రికి అరచేతివరకు ఏమీలేదు....

భయంకరంగా వున్నారు.

ప్రకృతి, సమాజం శపించిన మనుషులు.... కుష్ఠువాళ్లు.

నాకు భయంవేసింది.

అవును- మెట్లు దిగుతుంటే నాకు భయంవేసింది.

నాకూ్కడా ఏదో అవయవం లేదు. నిజమే- లేదు.

అవును- నిజమే-

నీకూ నాకూ గుండె లేదు....

— "స్వాతి" .... ?

# పిచ్చి

నేను జయబాబు అప్పుడే క్యాంటీన్‌లోంచి బైటికొస్తున్నాం. ఆమె వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమెకు ముప్ఫయ్యేళ్ళ వయస్సుంటుంది. ఎర్రగా నాజూగ్గా వుంది. కాశీర్క్ సిల్క్ చీర కట్టు కుంది. అదేరకం బ్లవుజ్ స్లీవ్‌లెస్ వేసుకుంది చేతిలో లేడీస్‌పర్స్— ఓ పుస్తకం వున్నాయి. ఫాషనబుల్‌గా ముడి చుట్టుకుంది. ముఖానికి కేక్ కాస్త ఎక్కువగా అద్దింది. పెదాలకు ఎర్రగా లిప్‌స్టిక్....